క్లుప్తంగా

ఘనంగా దేవర



పూజా కార్యక్రమంలో అమ్మవార్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మోడంపల్లెలో ఆదివారం దేవర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ, చిన్నమ్మలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవార్లకు సమర్పించారు. కోళ్లు, మేకలు అమ్మవారికి సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు.

వైభవంగా జ్యోతి ఉత్సవాలు



తలపై జ్యోతులు పెట్టుకుని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని నరసింహాపురంలో చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరిదేవి దేవాలయంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. శనివారం అర్ధరాత్రి జ్యోతులను వెలిగించి తలపై ఉంచుకుని గ్రామంలో నృత్యం చేస్తూ భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు ఆదివారం ఉదయం వరకు కొనసాగింది. భక్తులు కోళ్లు, మేకలు అమ్మవారికి బలి ఇచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న సగర సంఘం నాయకులు

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో ఆదివారం భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సగర సంఘం జిల్లా అధ్యక్షులు మాదాసు మురళీ ఆధ్వర్యంలో పల్లవోలు గ్రామంలోని అంకాలమ్మ తల్లి దేవాలయం వద్ద భగీరథ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భగీరథ మహర్షి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం నియోజకవర్గ అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శులు రామచంద్రుడు, సుబ్బరాయుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీల మైత్రి ఎన్నికల్లో విజయం



వసుంధరపాల్, రోజిపార్వతి

బద్వేలు అర్బన్ : సీఎస్ఐ సెయింట్ పాల్ టౌన్ చర్చి స్త్రీల మైత్రి ఎన్నికలలో వీరదాసరి వసుంధరపాల్ ఘన విజయం సాధించారు. ఆదివారం చర్చి ఆవరణలో నిర్వహించిన స్త్రీల మైత్రి ఎన్నికల్లో 50 మంది ఓటర్లు ఉండగా వీరదాసరివసుంధరపాల్ 35 ఓట్లు సాధించి ఘనవిజయం సాధించారు. జూలై నెలలో పాస్టేట్ కమిటీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి. గత 20 ఏళ్లలో ఎప్పుడూ కూడా స్త్రీల మైత్రికి ఎన్నికలు జరగలేదు. అనంతరం స్త్రీల మైత్రి ట్రెజరర్‌గా పెద్దిటిరోజిపార్వతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సెక్రటరీ, ట్రెజరర్‌గా ఎన్నికైన వారు మాట్లాడుతూ సంఘంలో స్త్రీల మైత్రిని అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషిస్తామని తెలిపారు.

ప్రశాంతంగా నీట్ పరీక్ష



రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతించారు. కాగా వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీలో 360 మంది విద్యార్థులకు గాను 355 మంది నీట్ పరీక్షకు హాజరవ్వగా ఐదుగురు గైర్హాజరయ్యారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ 172 మంది హాజరు కావాల్సి ఉండగా 168 మంది పరీక్షకు హాజరవ్వగా నలుగురు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షను మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. డీఎస్పీ భావన ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గ్రంథాలయంలో నీతి కథలు

చాపాడు : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆరవ రోజు ఆదివారం విద్యార్థులకు నీతి కథలపై అవగాహన కల్పించారు. వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సదస్సులో గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వక్తలు నీతి కథలు తెలియజేశారు. వేసవి సెలవులలో పూర్తి స్థాయిలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని గ్రంథాలయ అధికారి తెలిపారు.

బ్రహ్మంగారిమఠం.. అభివృద్ధి పథం

- ఊపందుకున్న పనులు
- భారీగా నిధుల కేటాయింపు
- భక్తులకు సమకూరనున్న సౌకర్యాలు



వీరబ్రహ్మేంద్రస్వామి నిత్య కల్యాణ మండపం



అన్నప్రసాద కేంద్రం

బ్రహ్మంగారిమఠం : జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాని, సంఘ సంస్కర్త, తత్త్వవేత్త, రాజయోగి, ఆధ్యాత్మికవేత్త, మహిమాన్వితుడిగా ఈ భూ మండలంపై కీర్తి గడించారు. ఆయన సజీవ సమాధి నిష్ఠ పొందిన ప్రదేశం బ్రహ్మంగారిమఠం. ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఈ నెల 4న ప్రారంభమైన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలు 9 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బ్రహ్మంగారిమఠంలో జరిగిన అభివృద్ధిపై అందిస్తున్న ప్రత్యేక కథనం.

రమణీయంగా రాజగోపురం

వీరబ్రహ్మేంద్రస్వామి మఠం 7 ఎకరాల 18 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. క్షేత్రం దక్షిణ ద్వారంలో ఐదు అంతస్తుల రాజగోపురాన్ని రమణీయంగా నిర్మించారు. ఉత్తర ద్వారం ఏర్పాటు చేశారు. గర్భాలయంలో గోడలకు గ్రానైట్.. ద్వారం, ఇరుపక్కల వెండి తొడుపు నిర్మాణం చేపట్టారు. స్వామి సజీవ సమాధికి వెండి తొడుపు, వెండి మకరతోరణం నిర్మించారు. కాలజ్ఞాన తాళపత్రాలకు వెండిపెట్టెలు ఏర్పాటు చేశారు. శ్రీ పోతులూరయ్య, పార్వతమ్మ, గోవిందమాంబ సమాధులకు ఇత్తడితో రుద్రాక్ష మండపం నిర్మించారు. ప్రధాన ఆలయంలో గోడలు, ఫ్లోరింగ్ గ్రానైట్ ఏర్పాటు, స్తంభాలకు ఇత్తడి తొడుగు ఏర్పాటు చేశారు. భక్తుల విడిది కోసం వీరగురు, గోవిందమాంబ సదనాలు నిర్మించారు. శాశ్వత నిత్య అన్నదాన పథకం నిర్వహిస్తున్నారు. ఇందుకోసం డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టారు. మఠం పార్కులో టూరిజం వారిచే పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.కోటి 68 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. స్వామి 21 అడుగుల విగ్రహాన్ని శోభాయమానంగా ఏర్పాటు చేశారు. శివాలయం, కల్యాణ మండపం, అలంకార మండపం, మహానివేదన మందిరం, బ్రహ్మరథం, టీటీడీ సత్రం పునరుద్ధరించారు. బ్రహ్మరథానికి రథశాల, క్యూకాంప్లెక్స్, మఠం పక్కన ఉన్న వంకకు కాజ్‌వే నిర్మించారు. ఆలయ ప్రాంగణాన్ని గ్రానైట్ బండపరుపుతో తీర్చిదిద్దారు. గణపతి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ పనులన్నీ మఠాధిపతుల ఆధ్వర్యంలో జరిగాయి. సుదీర్ఘ కాలం మఠాధిపతిగా ఉన్న శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి నేతృత్వంలో ఎక్కువగా చేపట్టారు.

భారీగా ప్రాకారం నిర్మాణం

మఠం ఫిట్‌పర్సన్‌గా సి.శంకర్‌బాలాజీ బాధ్యతలు చేపట్టిన తర్వాత అభివృద్ధి పనుల్లో వేగం పెరిగింది. ఇందుకోసం భారీగా నిధులు కేటాయించారు. అప్పటికే జరుగుతున్న పనులను పూర్తి చేయడంతో పాటు కొత్త వాటికి శ్రీకారం చుట్టారు. స్వామి నివాస గృహ ప్రాకారం గోడ, రాజగోపురాన్ని రూ.29 లక్షల 50 వేలతో నిర్మించారు. మఠం ఆవరణలోని టీటీడీ అతిథి గృహం సమీపంలో రూ.18 లక్షల 57 వేలతో కల్యాణ కట్ట నిర్మాణ పనులు చేపట్టారు. రూ.30 లక్షల 30 వేలతో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. వీఐపీల కోసం అతిథి గృహాన్ని రూ.15 లక్షల 39 వేలతో నిర్మిస్తున్నారు. గోకులాన్ని రూ.7 లక్షల 29 వేలతో చేపట్టారు. భక్తుల విశ్రాంతి కోసం డార్మెంటరీ హాల్‌ను రూ.81 లక్షల 70 వేలతో నిర్మిస్తున్నారు. ఈ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఆలయ ఉత్తరం వైపు ఫ్లోరింగ్, వంక సుందరీకరణ పనులు రూ.71 లక్షలతో చేపట్టారు. ధ్వజస్తంభాన్ని అట్టహాసంగా పునఃప్రతిష్ఠించారు. శాశ్వత విద్యుద్దీకరణ కోసం హైమాస్ లైటింగ్ ఏర్పాటుకు రూ.32 లక్షల 30 వేలు కేటాయించారు. దక్షిణ, పడమర భాగంలో గాల్వనైజ్డ్ రేకుల షెడ్‌ను రూ.98 లక్షలతో ఏర్పాటు చేస్తున్నారు. టీటీడీ అతిథి గృహం వద్ద రూ.47 లక్షలతో ఫ్లోరింగ్ పనులు చేస్తున్నారు. తిరుపతి, శ్రీశైలం దేవస్థానాల వలే క్షేత్రం చుట్టూ పెద్ద రాళ్లతో ప్రాకారం నిర్మించారు. ఇందుకోసం భారీగా నిధులు వెచ్చించారు. రక్షణ గోడ వెనుక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించనున్నారు. గోవిందమాంబ సదనం వద్ద ఫ్లోరింగ్, గాల్వనైజ్డ్ షెడ్, కొత్త డార్మెంటరీ వద్ద ఫ్లోరింగ్, బుక్ సేల్ కౌంటర్ తదితరాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దేవస్థానం సమీపంలో బస్‌షెల్టర్‌ను ప్రభుత్వం నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

పోలేరమ్మ దేవస్థానంలో..

శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠం పరిధిలోని పోలేరమ్మ దేవస్థానాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. మండపం, ప్రాకారం గోడ నిర్మాణాన్ని రూ.87 లక్షల 50 వేలతో పూర్తి చేశారు. ఆవరణలో వంటశాల, డైనింగ్ హాల్ నిర్మాణాన్ని రూ.15 లక్షల 27 వేలతో నిర్మించారు. ఆలయ ముఖద్వారాన్ని రూ.7 లక్షల 27 వేలతో ఏర్పాటు చేశారు. రూ.12 లక్షల 78 వేలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపట్టారు. రూ.88 లక్షలతో రక్షణ గోడ నిర్మించారు. రూ.72 లక్షలతో డార్మెంటరీ హాల్ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపారు. ఆర్‌సీసీ ఫ్లోరింగ్ పనులు రూ.36 లక్షల 50 వేలతో చేపడుతున్నారు. టాయ్‌లెట్ బ్లాక్‌ను రూ.42 లక్షల 50 వేలతో చేస్తున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే భక్తులకు సౌకర్యాలు సమకూరుతాయి.



పోలేరమ్మ దేవస్థానం

నిరంతర పర్యవేక్షణ



ఆన్‌లైన్ టెండర్ల ద్వారా పనులు చేపడుతున్నాం. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. దేవాలయాన్ని అభివృద్ధి చేయాలనే తపనతో పని చేస్తున్నాం. దాతలు, భక్తులు సహకరించాలి.

-సి.శంకర్‌బాలాజీ, ఫిట్‌పర్సన్, బ్రహ్మంగారిమఠం

వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో గోవిందమాంబ సమేత బ్రహ్మంగారు

మైదుకూరు : పట్టణంలోని బ్రహ్మంగారి ఆశ్రమం వద్ద నుంచి ఆదివారం రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాల సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు మాతా గోవిందమాంబ సమేత బ్రహ్మంగారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పట్టణంలోని నాలుగు రోడ్లలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో గంగా జయంత్యుత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల గ్రామం పాత గంగమ్మ ఆలయంలో గ్రామ దేవత గంగమ్మ జయంత్యుత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు భక్తితో గంగమ్మకు పూజలు చేశారు. తమను చల్లగా కాపాడాలంటూ గంగమ్మ తల్లికి నీరాజనాలు పలికారు. అక్కడికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. రాత్రి వేళలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

దేవాంగ విద్యార్థుల ప్రతిభకు పట్టాభిషేకం



మాట్లాడుతున్న దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం

ప్రొద్దుటూరు కల్చరల్ : దేవాంగ విద్యార్థిని, విద్యార్థులను విద్యలో ప్రోత్సహించేందుకు ది ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమం జూన్ 1న నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం తెలిపారు. ఆదివారం స్థానిక దేవాంగ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా 10వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రతిభ కబరిచిన దేవాంగ విద్యార్థులకు జూన్ 1న ఆదివారం ఉదయం 10 గంటలకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతిలో 350 మార్కులు, ఇంటర్‌లో 700 మార్కులుపైన సాధించిన అన్ని గ్రూపుల వారు ఈ నెల 20వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు మార్క్ లిస్టు, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీలు, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు దేవాంగ కల్యాణ మండపంలో ఇవ్వాలని సూచించారు. 10వ తరగతి, ఇంటర్‌లో తెలుగు మీడియం, ఇంగ్లిషు మీడియంలో మొదటి బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు అన్ని గ్రూపులకు, దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికి కన్సొలేషన్ బహుమతి రూ.2 వేలు ఇస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ది ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు వుట్టి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి గిద్దలూరు ఈశ్వరయ్య, కల్యాణ మండపం అధ్యక్షుడు రెడ్డి చంద్రశేఖర సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి మచ్చ వెంకటసుబ్బరాయుడు, ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

జ్ఞాపకాల కలబోత.. ఆత్మీయ పలకరింత

పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం



ప్రొద్దుటూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని కొత్తి హైస్కూల్‌లో 2000–2005 వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. పట్టణంతోపాటు రాష్ట్రం, ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి అల్లరి, ఆటలు, తమ గురువులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. కొందరు ఆనందభాష్పాలు రాల్చారు. ప్రేమగా, ఆప్యాయంగా తరగతి గదులను స్పృశిస్తూ.. పారవశ్యం పొందారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతులుగా తీర్చిదిద్దిన గురువులను సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాలకు పూర్వ వైభవం తేవాలని ఆకాంక్షించారు. గుండా సాంబశివయ్య మాట్లాడుతూ తాను కొత్తి చిన్నవెంకటసుబ్బయ్య దంపతుల వద్ద ఉంటూ ఇంటర్మీడియెట్ చదువుకున్నానని తెలిపారు. పాఠశాలలో ఆ దంపతుల విగ్రహం ఏర్పాటు చేయడానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఇంటర్మీడియెట్ కాలేజీ ఏర్పాటు చేసి కొత్తి చిన్న వెంకటసుబ్బయ్య కలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం మధ్యాహ్నం వేళ కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కొత్తి హైస్కూల్ ఫ్యామిలీ మెంబర్ వాణి, ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



బద్వేలులో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అట్లూరు : బద్వేలు పట్టణంలోని శ్రీలక్ష్మి విద్యారణ్య మహర్షి విద్యాలయంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఆ పాఠశాలలో 2004–05 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఉపాధ్యాయులను అతిథులుగా ఆహ్వానించి ఈ కార్యక్రమం చేపట్టారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో.. వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఎక్కడెక్కడో ఉద్యోగాలలో వివిధ హోదాలలో స్థిరపడిన వారు వచ్చేశారు. చిన్న నాటి మధుర క్షణాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సమష్టి నిర్ణయం తీసుకున్నారు. అనంతరం అందరూ కలసి విందు ఆరగించారు.

ఆంధ్రులకు మోదీ మరోసారి మోసం



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని

బద్వేలు అర్బన్ : అమరావతి పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రానికి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేశారని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని అన్నారు. ఆదివారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాజధాని నిర్మాణం కోసం అధిక మొత్తంలో నిధులు ఇచ్చామని మోదీ అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు పన్నుల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి కట్టిన నిధులలో 50 శాతం పైగా నిధులు రాష్ట్ర వాటాగా రావాల్సినప్పటికీ.. వాటిని కూడా సక్రమంగా ఇవ్వలేదని అన్నారు. ఇన్ని అవాస్తవాలు చెబుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గానీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గానీ విద్యాశాఖామంత్రి నారాలోకేష్ గానీ స్పందించకపోవడం దారుణమన్నారు. రాజధాని నిర్మాణానికి 5 వేల ఎకరాలు సరిపోతుందని నిపుణులు చెబుతున్నప్పటికీ 34 వేల ఎకరాలు సేకరించారని, ఇది ఎవరి ప్రయోజనాల కోసం సేకరించారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అప్పులు తెచ్చి రాజధానిని నిర్మిస్తే ప్రజలపై భారం పడటం తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదని అన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, ఉపాధ్యక్షుడు యువరాజ్ పాల్గొన్నారు.

షిరిడీకి ప్రత్యేక బస్సు సర్వీసు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఏపీఎస్ ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 8న రాత్రి 8 గంటలకు షిరిడీకి బస్సు బయల్దేరునని ఆర్టీసీ డిపో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. చిలుకూరు బాలాజీ, పండరీపురం, శనిసింగారం, షిరిడీ, నాసిక్, త్రయంబకేశ్వరం, బాసర, యాదగిరి గుట్ట, ఈటూరు ప్రాంతాలు ఐదు రోజులు ప్రయాణం చేసి తిరిగి ప్రొద్దుటూరుకు చేరుకుంటుందని వారు వివరించారు. రాను, పోను బస్సు చార్జీ రూ.5,500, ఈ టూర్‌లో మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. టికెట్ రిజర్వేషన్ చేసుకునే వాళ్లు అడ్వాన్స్‌గా రూ.2 వేలు చెల్లించి సీట్ రిజర్వేషన్ చేసుకోవాలని, రానిపక్షంలో అడ్వాన్స్ తిరిగి ఇవ్వరని పేర్కొన్నారు. 7382866916, 7382867512, 7382867136 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఆరాధనోత్సవాల ఏర్పాట్ల పరిశీలన



ఫిట్‌పర్సన్‌తో మాట్లాడుతున్న ఎస్ఐ శివప్రసాద్

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజా మహోత్సవాల ఏర్పాట్లను ఎస్ఐ బి.శివప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మఠం ఫిట్‌పర్సన్ శంకర్ బాలాజీతో చర్చించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు, ఆటంకాలు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఫిట్ పర్సన్ తెలిపారు. భద్రతా ఏర్పాట్లపై ఎస్ఐ పోలీసులతో చర్చించారు.

కాశినాయన ఎస్ఐగా యోగేంద్ర



కాశినాయన : కాశినాయన మండల ఎస్ఐగా పి.యోగేంద్ర ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న హనుమంతు ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రొద్దుటూరు త్రీటౌన్ ఎస్ఐగా పని చేస్తున్న యోగేంద్ర బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా

పోరుమామిళ్ల : సంచర్ల పంచాయతీలోని రామేశ్వరం, బూరగమానుపల్లె గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో శనివారం నీటి సరఫరాకు సమస్య తలెత్తింది. స్పందించిన సర్పంచ్ దస్తగిరి పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్‌రెడ్డికి చెప్పడంతో.. ఆయన ఆదివారం ట్యాంకర్ ఏర్పాటు చేసి ప్రజలకు నీటిని అందించారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

చాపాడు : మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 5 నుంచి 15వ తేది వరకూ ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీర కిషోర్ తెలిపారు. 5న మడూరు, 6న అన్నవరం, 7న చియ్యపాడు, 8న సోమాపురం, 12న చాపాడు, 13న ఎస్.ఓబాయపల్లె, 14న బద్రిపల్లె, 15న అల్లాడుపల్లె గ్రామ సచివాలయాల వద్ద ఆధార్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆరేళ్ల పిల్లలకు కొత్త ఆధార్ నమోదుతోపాటు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

కమనీయం.. కల్యాణం



స్వామి, అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

రాజుపాళెం : మండల పరిధిలోని తొండలదిన్నె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వాముల కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి జరుగుతున్నాయి. ఉదయం స్వాముల వారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. గ్రామంలోని మహిళలు, పిల్లలు, యువకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో వచ్చి స్వాముల వారి కల్యాణాన్ని తిలకించారు. గ్రామానికి చెందిన నూకల రామచంద్రుడు, నూకల విజయకుమార్ దంపతులు స్వామి వార్లకు కల్యాణం చేయించారు. టీటీడీ వేద పండితులు చింతలరాయన్ అయ్యంగార్ వారి బృందంచే కల్యాణం చేశారు. అనంతరం స్వాముల వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామంలోని వీధులలో విగ్రహాలను ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట కోలాటం ఆకట్టుకుంది. రాత్రివేళలో భజన కార్యక్రమం నిర్వహించారు.

అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలందుకుంటున్న వినాయకస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం తదితర పూజా కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయం ముస్తాబు



రాచాయపేటలోని అభయాంజనేయస్వామి ఆలయం

గోపవరం : మండలంలోని రాచాయపేటలో వెలసిన శ్రీఅభయాంజనేయస్వామి 17వ వార్షికోత్సవం ఈ నెల 7వ తేదీ బుధవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. బుధవారం ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి అభిషేకం, హోమం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం ఉంటుంది. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఈ వార్షికోత్సవానికి హాజరు కానున్నారు. వచ్చిన భక్తులకు మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. రాత్రి కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వచ్చే భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వార్షికోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు కోరారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెద్దుళ్ళపల్లె ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడు దఫాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా.. దేశంలో ఉన్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ నిరుద్యోగ సమస్యను మరింత పెంచుతోందని అన్నారు. మరోవైపు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆయా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని, అంత వరకు ప్రతి నెల రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఆ హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, పట్టణ నాయకులు మధు, లోకేష్, వరకుమార్, మల్లేష్, దినేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయవాడ బస్సు సర్వీసు ప్రారంభం

బద్వేలు అర్బన్ : బద్వేలు డిపో పరిధిలోని ప్రజల కోరిక మేరకు సోమవారం బద్వేలు డిపో నుంచి విజయవాడకు నూతన సర్వీసు (సర్వీసు నెంబర్ 6254) సూపర్‌లగ్జరీ బస్సును ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం ఆర్.సి.నిరంజన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 9–30 గంటలకు బద్వేలు డిపో నుంచి ప్రారంభమై వయా దుత్తలూరు, పామూరు, కందుకూరు, సింగరాయకొండ, ఒంగోలు, చిలకలూరిపేట, గుంటూరు మీదుగా విజయవాడకు తెల్లవారుజామున 5 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి ఉదయం 7–45 గంటలకు (సర్వీసు నెంబర్ 6255) విజయవాడ బస్టాండు నుంచి బయలుదేరి సాయంత్రం 3–30 గంటలకు బద్వేలుకు చేరుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.